సాక్షి
నిర్మల్

బుధవారం ၊ 25 ၊ జనవరి ၊ 2023



ఓటరా.. మీదే నిర్ణయం !

ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఈ ఏడాది భారత ఎన్నికల సంఘం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' అనే పిలుపునిచ్చింది. 8లో▸



'వసంత' ఉత్సవాలు ప్రారంభం

బాసరలో వసంత పంచమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. భక్తుల కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.3 / 16.1

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు ఒకటి రెండు డిగ్రీలు తగ్గుతాయి. చలి ప్రభావం అంతగా ఉండదు.

న్యూస్‌రీల్

మాస్టర్‌ప్లాన్‌పై ఆందోళన వద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్

నిర్మల్‌టౌన్: మాస్టర్ ప్లాన్‌పై రైతులు, ప్రజలు ఆందోళన చెందొద్దని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్, తల్వేద ప్రాంతంలో రైతులతో కలిసి మాస్టర్‌ప్లాన్, పారిశ్రామిక జోన్‌ను మంగళవారం పరిశీలించారు. రైతులు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి రైతులకు అండగా ఉంటారని పేర్కొన్నారు. చైర్మన్ వెంట టీపీవో సుమలత, రైతులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఆయిల్‌పాం సాగు చేయాలి



అవగాహన కల్పిస్తున్న డీఏవో అంజిప్రసాద్

లోకేశ్వరం: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ సూచించారు. మండలంలోని బిలోలి గ్రామంలో రైతులు సాగుచేస్తున్న ఆయిల్‌పాం తోటలను మంగళవారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు మొక్కలకు రాయితీతోపాటు డ్రిప్ పరికరాలపై రాయితీ కల్పిస్తోందన్నారు. మొక్కలు నాటిన నాలుగేళ్లకు ఎకరానికి రూ.4,200 చొప్పున రాయితీ వర్తిస్తుందని తెలిపారు. ఎకరాకు 50 మొక్కలను రైతులు రూ.వెయ్యి చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఆసక్తిగల రైతులు ఆయిల్‌పాం కంపెనీ మండల క్లస్టర్ అధికారులను సంప్రదించాలని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



శుభాకాంక్షలు తెలుపుతున్న సురేశ్ చౌహాన్

భైంసాటౌన్: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ సురేశ్ చౌహాన్ సూచించారు. భైంసా బస్టాండ్‌ను మంగళవారం సందర్శించారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసంతపంచమి సందర్భంగా హైదరాబాద్ నుంచి బాసరకు అదనంగా ఐదు సర్వీసులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భైంసా నుంచి బాసర మీదుగా నిజామాబాద్‌కు ప్రతీ పది నిమిషాలకు ఒక సర్వీసు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు డ్రైవర్స్‌డే సందర్భంగా పలువురు డ్రైవర్లకు గులాబీపూలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కౌన్సిల్.. కింకర్తవ్యం!

- 'ముసాయిదా' రద్దుకు రైతుల పట్టు
- మున్సిపల్ తీర్మానం చేయాలని డిమాండ్
- ఆందోళనల దిశగా బీజేపీ, కాంగ్రెస్
- కమిటీగా ఏర్పడ్డ రైతు జేఏసీ నాయకులు
- కలెక్టరేట్‌లో వినతి పత్రమిచ్చిన బీజేపీ
- మంత్రిపై విమర్శలు చేసిన 'ఏలేటి'



నిర్మల్: రాష్ట్రవ్యాప్తంగా మాస్టర్‌ప్లాన్ ముసాయిదాలను రద్దు చేశామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వయంగా ప్రకటించినా నిర్మల్ రైతుల్లో నమ్మకం కలగడం లేదు. మున్సిపల్ చైర్మన్ డ్రాఫ్ట్‌లో సవరణలే ఉంటాయని చెప్పడం, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు నోటిమాటలు కాకుండా ముసాయిదా రద్దుకు మున్సిపల్‌లో తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తుండటంతో రైతుల్లో సందిగ్ధత తొలగడం లేదు. మరోవైపు బీజేపీ తన ఆందోళనలో భాగంగా కలెక్టరేట్‌లో డ్రాఫ్ట్ రద్దు చేయాలంటూ మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. మాస్టర్ ప్లాన్‌లో మొత్తం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వలాభం కోసం ప్రతిపాదనలు చేశారంటూ ఏఐసీసీ నేత మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మాస్టర్ ప్లాన్‌పై రైతుల ఆందోళన క్రమంగా విపక్షాలకు అస్త్రంగా మారుతుండడంతో మున్సిపల్ కౌన్సిల్ ఏం చేస్తుందన్న ప్రశ్న తలెత్తుతోంది.

తమ భూములే తమకు దిక్కని, వాటిని కోల్పోయేందుకు తాము సిద్ధంగా లేమంటూ జిల్లా కేంద్రం రైతులు వారం రోజులుగా మున్సిపల్, కలెక్టరేట్‌లతోపాటు మంత్రి నివాసానికి తిరుగుతున్నారు. రైతు ఐక్యకార్యాచరణ కమిటీ పేరిట వారంతా ఒక్కటిగా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు ఇదేక్రమంలో నిర్మల్‌లోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులంతా ఓ కమిటీగా ఏర్పడినట్లు తెలిసింది. ఇందులో ఎవరికీ బాధ్యతలు ఇవ్వకుండా అంతా కలిసి ఒకే కమిటీగా ఏర్పడినట్లు చెబుతున్నారు. జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్, బుధవార్‌పేట్, విశ్వనాథ్‌పేట్, గాజులుపేట్, కంచెరోనికట్ట తదితర ప్రాంతాలకు చెందిన రైతుల్లో నుంచి 20 మందిని ఎన్నుకుని కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం.

బల్దియాలో తీర్మానం చేయాలి..

పట్టణాభివృద్ధికి, మాస్టర్‌ప్లాన్‌కు తాము వ్యతిరేకం కాదని, కానీ తమ భూములు, పొలాలు తమకు కాకుండా చేసే ప్రతిపాదనలను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని రైతు ఐక్యకార్యాచరణ వేదిక చెబుతోంది. నిర్మల్ చుట్టూ ఉన్న రైతుల్లో చాలామందికి గుంటల భూములే ఉన్నాయని, తమ పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం వాటిని కాపాడుకుంటున్నామని పేర్కొంటున్నారు. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్‌లో ఆ చిన్నపాటి భూములు పోయేలా ప్రతిపాదించడమే ఇబ్బందికరంగా మారుతోందంటున్నారు. ప్రస్తుత ప్రతిపాదనలన్నీ రద్దు చేసేలా మున్సిపాలిటీ తీర్మానం చేయాలని కోరుతున్నారు. మంత్రి మాటలు, ఇచ్చిన హామీలపై తమకు గౌరవం ఉందని పలువురు రైతుజేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. అదే మాట మీద కామారెడ్డిలో చేసినట్లు మున్సిపల్‌లోనూ తీర్మానం చేసి, డ్రాఫ్ట్‌ను రద్దు చేసి తమకు భరోసా ఇవ్వాలని కోరుతున్నారు.

ఏం జరగనుంది..

రైతులతోపాటు ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై ఒత్తిడి పెంచుతుండటంతో నిర్మల్ మున్సిపల్ కౌన్సిల్ ఆలోచనల్లో పడినట్లు తెలుస్తోంది. ఓవైపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మాస్టర్‌ప్లాన్ రద్దు చేసినట్లు మంత్రి చెప్పగా, మరోవైపు సవరణలు మాత్రమే ఉంటాయంటూ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ చెప్పడం పట్టణవాసులు అయోమయానికి గురయ్యారు. అధికారపార్టీకే చెందిన ఇద్దరు చెరోరకంగా చెప్పడమేంటన్న విషయంపైనే మంగళవారం చర్చ కొనసాగింది. వీటన్నింటి నేపథ్యంలో ముసాయిదా రద్దు దిశగా కౌన్సిల్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు డ్రాఫ్ట్‌పై అభ్యంతరాల స్వీకరణ కొనసాగుతుందని బల్దియా అధికారులు పేర్కొంటున్నారు. ఇదే విషయంపై మున్సిపల్ కమిషనర్ వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'ముసాయిదా' రద్దు చేయాల్సిందే..

నిర్మల్: క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా, పట్టణ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తయారు చేసిన నిర్మల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా లోపభూయిష్టంగా ఉందని, దీనిని మున్సిపాలిటీలో తీర్మానం చేసి రద్దు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు అప్పాల గణేశ్‌చక్రవర్తి డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్‌లన్నీ రద్దు చేశామని మంత్రి, లేదు ముసాయిదాలో సవరణలే ఉంటాయని మున్సిపల్ చైర్మన్ పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇది ప్రజలను, రైతులను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. పెరుగుతున్న పట్టణ జనాభా, వైశాల్యాన్ని లెక్కలోకి తీసుకోకుండా ముసాయిదాలో తమ స్వప్రయోజనాల కోసం ప్రతిపాదనలు చేశారని ఆరోపించారు. ముసాయిదాను ప్రజల్లోకి తీసుకెళ్లకపోవడమే అధికారపార్టీ రహస్య ఎజెండాను బహిర్గతం చేస్తోందన్నారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులకు, అనుచరులకు అనుగుణంగా గ్రీన్‌జోన్‌లో ఉన్న భూములను కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చుకున్నారని ఆరోపించారు. సామాన్య రైతుల భూములను, ప్రజల ప్లాట్లను ఇండస్ట్రియల్ జోన్‌లోకి మారుస్తూ ప్రతిపాదనలు చేశారన్నారు. ఈ ప్రతిపాదనలను వెంటనే రద్దుచేస్తూ, రైతులకు, ప్రజలకు అనుకూలంగా, శాస్త్రీయంగా కొత్త మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పార్టీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు సామ రాజేశ్వర్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, సీనియర్ నాయకులు అంజుకుమార్‌రెడ్డి, ఒడిసెల శ్రీనివాస్, అయ్యన్నగారి రాజేందర్, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మంత్రి స్వలాభం కోసమే

'మాస్టర్‌ప్లాన్'

- డ్రాఫ్ట్ రద్దుచేసే అధికారం మంత్రికి ఉందా..?
- ముసాయిదా రద్దు కోసం న్యాయపోరాటం
- ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తన కుటుంబ సభ్యుల, బంధువుల స్వలాభం కలిగేలా మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ తయారు చేయించారని, ఆ ముసాయిదాను రద్దు చేయాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం మాట్లాడారు. నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనల వెనుక ఉన్న మాస్టర్‌మైండ్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డేనని ఆరోపించారు. మంత్రి ఏ హోదాతో మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ రద్దు చేశారని ప్రశ్నించారు. సోఫీనగర్‌లో పలు సర్వే నంబర్లు ఇండస్ట్రియల్, కమర్షియల్ జోన్లలో ఉండగా, వాటిని డ్రాఫ్ట్‌లో రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చారన్నారు. రెసిడెన్షియల్‌జోన్‌లో ఉన్న రైతుల భూములను గ్రీన్, ఇండస్ట్రియల్ జోన్‌లోకి మార్చారని మండిపడ్డారు. మంత్రి, మున్సిపల్ చైర్మన్లు మాస్టర్‌ప్లాన్‌పై విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు నష్టం కలిగేలా మాస్టర్‌ప్లాన్ తయారు చేయించిన మంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్లాన్ రద్దు చేయాలని న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు దొడ్డికింది ముత్యంరెడ్డి, సీనియర్ నాయకులు తక్కల రమణారెడ్డి, జమాల్, సత్యం చంద్రకాంత్, ముత్యంరెడ్డి, డొంగరి సంతోష్, మౌర్య చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాసరకు ప్రత్యేక బస్సులు

నిర్మల్‌టౌన్: ఈ నెల 26న వసంత పంచమిని పురస్కరించుకుని నిర్మల్ బస్టాండ్ నుంచి బాసరకు ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళలు, బాలికల సంక్షేమానికి ప్రాధాన్యం

- మంత్రులు ఇంద్రరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్

నిర్మల్ టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలు, బాలికల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్ జాతరకు మంగళవారం వెళ్తున్న సత్యవతి రాథోడ్‌కు నిర్మల్ అటవీశాఖ కార్యాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ ముషరఫ్ అలీ, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బేటీ బచావో– బేటీ పడావో అవగాహన, సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాలకార్మిక రహిత తెలంగాణ పుస్తకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. అన్నిరంగాల్లో ముందుండాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

సారంగపూర్: బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని చించోలి(బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్రంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాలల సంరక్షణ చర్యలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలలకు అభివృద్ధి చెందేహక్కు, రక్షణ పొందే హక్కు, పాల్గొనే హక్కు, జీవించే హక్కు ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణకు రూపొందించిన వివిధ చట్టాలు, వాటి ద్వారా బాలికలకు కలిగే లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాంగణం అధికారి విజయలక్ష్మి, సీడీపీవోలు నాగమణి, నాగలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వియగౌరి, భాగ్య, సంధ్యారాణి, మంగళ, నళిని, డీసీపీవో మురళి, సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్, సైమన్ సుందర్ పాల్గొన్నారు.



పుస్తకం ఆవిష్కరిస్తున్న మంత్రులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్

న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలి

నిర్మల్ టౌన్: బాలికలు న్యాయ సేవలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ సేవలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ... సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహహింస చట్టం, నిర్వహణ చట్టం న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు..

'పది'లో ప్రథమస్థానం సాధించాలి



స్టడీ మెటీరియల్ పొందిన విద్యార్థులతో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, డీఈవో

- మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ రూరల్: పదో తరగతి విద్యార్థులు గతేడాది రాష్ట్రంలో జిల్లాను ద్వితీయస్థానంలో నిలిపారని, ఈసారి ప్రథమస్థానం సాధించేలా విద్యార్థులు కష్టపడి చదవాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్స్‌లో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ముషరఫ్ అలీ, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని సూచించారు. ప్రతీ పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్ రెడ్డి, ఎస్‌ఎస్‌ఈఆర్టీ ప్రొఫెసర్ రవికాంతరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

గిరిజనదర్బార్

- జనసంద్రమైన నాగోబా ఆలయం
- హాజరైన ఇద్దరు రాష్ట్ర మంత్రులు.. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు..
- ఆలయంలో ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



నాగోబా జాతరకు తరలివస్తున్న భక్తజనం

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతరలో భాగంగా మంగళవారం గిరిజన దర్బార్ అట్టహాసంగా సాగింది. రాష్ట్ర మంత్రులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ రాకతో మెస్రం వంశీయుల్లో ఉత్సాహం నెలకొంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరందరికీ మెస్రం వంశ పెద్దలు తలపాగాలు ధరింపజేశారు. నాగోబా చిత్రపటాలను అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన దర్బార్‌లో వీరంతా పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలతో ఘనస్వాగతం

గిరిజన దర్బార్ సందర్భంగా కేస్లాపూర్‌కు వచ్చిన రాష్ట్ర మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు మెస్రం వంశీయులు ఘనస్వాగతం పలికారు. తొమ్మిది తెగలవారు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆలయం వరకు స్వాగతించారు. డోలు, కాలికోం తదితర వాయిద్యాలతో హోరెత్తించారు. నాగోబా దర్శనం అనంతరం మెస్రం వంశీయులు బస చేసి ఉన్న గోవాడ్‌ను మంత్రులు సందర్శించారు. వంశ మహిళలతో కలిసి జొన్న గట్క ఉండలను తయారు చేశారు. గోవాడ్ చరిత్రను తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు బృందం సభ్యుల గుస్సాడీ నృత్యం ఆకట్టుకుంది. చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. భద్రాచలం ఆదివాసీల కళా బృందం సభ్యులు, వివిధ పాఠశాలల విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తెలంగాణతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు.

వినతుల స్వీకరణ

ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖల అధికారులు దరఖాస్తు సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆదివాసీ గిరిజనుల నుంచి వివిధ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. గిరి వికాసం పథకంలో వ్యవసాయ బోర్లు, భూహక్కు పత్రాలు, ఎడ్ల జతలు, ఎడ్ల బండ్లు తదితర పథకాల కోసం అర్జీలు అందించారు. మంత్రులతోపాటు కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఆదిలాబాద్, కుమురంభీం జెడ్పీ అధ్యక్షులు రాథోడ్ జనార్దన్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీలు దండే విఠల్, రఘోత్తంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్, కోనేరు కోనప్ప, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రిజ్వాన్ భాషాషేక్, నటరాజ్, మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఆలయ కమిటీ సభ్యుడు వెంకట్‌రావు పటేల్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లలో మోసం చేసింది కేంద్రమే



గిరిజనుల రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన దర్బార్‌ను బీజేపీ నేతలు రాజకీయ వేదికగా మార్చుకున్నారు. గత పాలకులు గిరిజనులను ఓటు బ్యాంక్‌గా వాడుకోగా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం వారి అభివృద్ధికి పాటుపడింది. విద్యుత్ లేని గ్రామాలకు సౌకర్యం కల్పిస్తాం. అవసరమైతే సోలార్ సిస్టమ్ ద్వారా వెలుగులు నింపుతాం.

– సత్యవతి రాథోడ్, మంత్రి

ఆలయ అభివృద్ధికి కృషి



నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం. ఇదివరకు రూ.15 కోట్లు ఖర్చు చేయగా, వీటిలో ఐటీడీఏ ద్వారా రూ.5 కోట్లు వెచ్చించాం. ఇతర సదుపాయాల కోసం రూ.12.50కోట్లు విడుదల చేశాం. పోడు రైతులకు పట్టాలు అందజేసి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. కేంద్ర మంత్రి, ఎంపీలు బండి సంజయ్, సోయం బాపూరావు కేస్లాపూర్‌కు వచ్చినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఏజెన్సీలో ఇదివరకు విషజ్వరాలతో మృత్యువాత పడుతుండగా, ప్రస్తుతం గూడేల్లో విషజ్వరాల ముచ్చటే లేదు.

– అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మంత్రి

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. గిరిజన గూడేలకు రోడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీలకు భవన నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు కేటాయిస్తోంది. ఆదివాసీ గూడేలు, గ్రామాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధికి తోడ్పాటునందిస్తోంది.

– దండే విఠల్, ఎమ్మెల్సీ

మా హయాంలోనే అభివృద్ధి



మా ప్రభుత్వ హయాంలోనే కేస్లాపూర్‌ను అభివృద్ధి చేశాం. జోడేఘాట్‌ను కూడా ఇదే తరహాలో అభివృద్ధి చేశాం. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై కుమురంభీం విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి పలుసార్లు విన్నవించినా స్పందనలేదు. ఖానాపూర్ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతం గుండా ఉన్న గ్రామాలకు రోడ్ల నిర్మాణం కోసం కేంద్రం అనుమతులు ఇవ్వలేదు.

– రేఖానాయక్, ఖానాపూర్ ఎమ్మెల్యే

'కంటి వెలుగు'లో ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ ముషరఫ్ అలీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు వైద్యశిబిరాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని కలెక్టర్ ముషరఫ్ అలీ సూచించారు. నిర్మల్ పట్టణంలోని ద్యాగవాడ, కుర్రాన్‌పేట కంటివెలుగు శిబిరాలను ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం సందర్శించారు. వైద్య శిబిరంలో సౌకర్యాలు, ఏర్పాట్లు, రికార్డులను పరిశీలించారు.

సద్వినియోగం చేసుకోవాలి

కుంటాల : కంటి వెలుగు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండినవారంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. మండలంలోని అంబకంటి తండాలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం పరిశీలించారు. కేంద్రానికి వచ్చేవారికి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఉన్నారు.

క్లుప్తంగా

ఆచూకీ లభ్యం



పుష్పలతను కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన కొండ్ర పుష్పలత ఆచూకీ లభించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఐదు రోజుల క్రితం తన కూతురు పుష్పలత ఇద్దరు పిల్లలతో వెళ్లిపోయిందని ఆదివారం తల్లి సరళచంద్ర ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం సోన్ మండలంలోని కంజర్ గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందడంతో పుష్పలత, తన ఇద్దరు పిల్లలను భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబీకులకు అప్పగించారు.

ద్విచక్ర వాహనం చోరీ

భైంసా: ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన బాసర మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. బాసరకు చెందిన ఆకుల రవి ద్విచక్ర వాహనం ట్రిపుల్‌ఐటీ పక్కన పెట్టి పంట చేనులోకి పనుల నిమిత్తం వెళ్లాడు. వచ్చి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

28న ఎన్‌వైకే ఆధ్వర్యంలో వక్తృత్వ పోటీలు

కైలాస్‌నగర్: జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో భాగంగా ఖమ్మం నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 28న వర్చువల్ విధానంలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎన్‌వైకే అధికారి సుశీల్ బడ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల యువతీ, యువకులు తమ దరఖాస్తు ఫారాన్ని వెబ్‌సైట్‌లో https://forms.gle/ VtkZDPDSRxS2XB5u8 దరఖాస్తు సమర్పించాలని పేర్కొన్నారు. 18 నుంచి 25 ఏళ్ల వయస్సు గల వారు అర్హులన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. జాతీయస్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1.50 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష, రెండు కన్సోలేషన్ బహుమతులు రూ.50 వేల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో నిర్వహించే పోటీలను జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీలో సోమవారం రాత్రి గొడవపడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్, ఇస్మైల్‌లు ఇంటి ప్లాట్ సరిహద్దుల విషయంలో ఇరువురు గొడవపడ్డారు. దీంతో ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



- ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు
- మన ఓటే మన ప్రాంత భవిష్యత్
- ఈసారి నినాదం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్'
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భారత రాజ్యాంగం 18ఏళ్లు నిండిన ప్రతీ పౌరునికి ఓటు హక్కు కల్పిస్తోంది. కుల, లింగ, ప్రాంత, వర్ణ, ధనిక, పేద, వర్గ తదితర తేడా లేకుండా అవకాశం ఇస్తోంది. తమ ప్రజాప్రతినిధులను తామే ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది. ఓటుతో చట్టసభల్లో ఎవరిని కూర్చోబెట్టాలో నిర్ణయించవచ్చు. దేశంలో గ్రామ వార్డు సభ్యుడి నుంచి రాష్ట్రపతి వరకు ఓటు హక్కు ద్వారానే ఎన్నికలు సాగుతున్నాయి. ఈ క్రమంలో భారత ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఓటు ప్రాధాన్యత తెలియక, ఓటు వేయకపోవడంతోపాటు ఓటును ప్రలోభాలకు అమ్ముకోవడం వంటివి ప్రజాస్వామ్య విలువలను పాతరేస్తున్నాయి. ఈ ఏడాది భారత ఎన్నికల సంఘం 'నథింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ ష్యూర్' (ఓటు లాగా ఇంకేదీ లేదు, నేను కచ్చితంగా ఓటేస్తా) అనే నినాదంతో ఓటు హక్కు పొందిన ప్రతీ ఒక్కరిని పోలింగ్‌లో భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశ్యంతో పిలుపునిచ్చింది.

ఇప్పుడంతా ఆన్‌లైన్‌లోనే..

కొత్త ఓటరు నమోదు నుంచి, ఎపిక్ కార్డు పొందడం, ఆధార్ అనుసంధానం, అడ్రస్‌లో మార్పులు, చేర్పులు, ఫాంలు 6, 6ఏ, 6బీ, 7, 8 వరకు అన్నీ ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. వివరాలకు భారత ఎన్నికల సంఘం అధికార వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు. లేకపోతే స్థానిక బూత్ లెవల్ ఆఫీసర్‌తో నేరుగా సంప్రదించి, ఓటరు కార్డు పొందడంతోపాటు ఇతర మార్పులు చేసుకోవచ్చు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతాలు.

నియోజకవర్గం	2014	2018
సిర్పూరు	78.88	85.93
చెన్నూరు(ఎస్సీ)	72.73	82.32
బెల్లంపల్లి(ఎస్సీ)	73.85	83.10
మంచిర్యాల	64.62	73.17
ఆసిఫాబాద్(ఎస్టీ)	77.10	86.00
ఖానాపూర్(ఎస్టీ)	73.77	80.50
ఆదిలాబాద్	63.88	81.64
బోథ్(ఎస్టీ)	79.91	85.29
నిర్మల్	76.89	79.13
ముథోల్	78.76	84.02
మొత్తం	74.04	82.11

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	18–19ఏళ్ల ఓటర్లు	మొత్తం ఓటర్లు
సిర్పూర్	1,06,970	1,05,333	7	2,910	2,12,310
చెన్నూర్(ఎస్సీ)	88,497	87,947	11	1,692	1,76,455
బెల్లంపల్లి(ఎస్సీ)	80,894	80,341	14	1,222	1,61,249
మంచిర్యాల	1,24,769	1,24,193	20	1,696	2,48,982
ఆసిఫాబాద్(ఎస్టీ)	1,04,107	1,03,785	14	3,082	2,07,906
ఖానాపూర్(ఎస్టీ)	1,01,201	1,04,537	13	2,812	2,05,751
ఆదిలాబాద్	1,11,039	1,14,016	7	3,055	2,25,062
బోథ్(ఎస్టీ)	98,456	1,02,576	2	3,885	2,01,034
నిర్మల్	1,10,538	1,22,696	14	3,601	2,33,248
ముథోల్	1,13,251	1,19,092	27	3,760	2,32,370

గత అసెంబ్లీ ఎన్నికలు పరిశీలిస్తే

2018 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పది శాసనసభ నియోజకవర్గాల్లో సగటున 82.11 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో 90శాతం నమోదైంది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ 71వ బూత్‌లో ఏకంగా 100 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడి ఓటర్ల చైతన్యం ఈ పోలింగ్ సరళి చెబుతోంది. ఆసిఫాబాద్‌లో 86, సిర్పూరులో 85.93, బోథ్‌లో 85.29 శాతం పోలింగ్ నమోదైంది. ఇక చెన్నూరు, బెల్లంపల్లి, ఆదిలాబాద్, ఖానాపూర్, ముథోల్, బోథ్‌లలో కూడా 80 నుంచి 85 శాతం వరకు పోలింగ్ నమోదైంది. పట్టణ ప్రాంత ప్రజలు విద్యావంతులుగా చెబుతున్నా.. చాలామంది ఓటు వేసే తీరిక లేకుండా పోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోనే అత్యల్పంగా ఓట్లు నమోదు అవుతున్నాయి.



పలు సమస్యలపై మంత్రులకు వినతి పత్రాలు



నిరసన తెలుపుతున్న నాయకులు



వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా దర్బార్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పలు సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిలకు వినతిపత్రాలు అందించారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కాంబ్లే బాలాజీ ఆధ్వర్యంలో అనాథ పిల్లల సంక్షేమం కోసం కృషి చేయాలని, ఏడేళ్లుగా మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలను అమలుచేయాలని విన్నవించారు. అదే విధంగా టీఎస్‌టీటీఎఫ్ ఆధ్వర్యంలో జీవో నం.3 పునరుద్ధరించాలని కోరారు. అటవీ హక్కు భూముల సర్వేలో కోలాం గిరిజనుల నుంచి అటవీశాఖ అధికారులు సర్వే పేరుతో డబ్బులు వసూలు చేశారని, చర్యలు తీసుకోవాలని కేస్లాపూర్ ఎంపీటీసీ, కోలం గిరిజన సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి భీంరావ్ కోరారు.

నాందేడ్ సభ ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఫిబ్రవరి 5న జరిగే సభ ఏర్పాట్లను ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తంగా అమలు చేసేందుకు టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సభలో చేరికలు, రైతు సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు.



ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న దృశ్యం

27న ఆయా జిల్లాల్లో ఔట్ రీచ్ ప్రోగ్రాం

కౌటాల: ఉద్యోగుల భవిష్యత్ నిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ నెల 27వ తేదీన నిధి ఆప్కే నికత్ పీఆఫ్ మీ ముంగిట అవగాహన శిబిరం, ఔట్ రిచ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కరీంనగర్ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వట్‌కార్ తానయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:45 గంటల వరకు అన్ని జిల్లాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని పద్మశాలి భవనంలో.. ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లోని ఎల్లాగౌడ్ తోటలోని పద్మశాలి భవన్‌లో.. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలోని సురభి హోటల్‌లో.. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మయూరి హోటల్‌లోని మినీ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

రసాయననీటిని తాగి 15మేకలు మృతి



మృతిచెందిన మేకలు

తాంసి: చేనులో రసాయన మందులు కలిపిన నీటిని తాగి 15మేకలు మృత్యువాత పడ్డాయి. మండల కేంద్రానికి చెందిన పుట్టపర్తి పెంటన్న తన 40మేకలను తీసుకుని పశుగ్రాసం కోసం మంగళవారం పంటచేనుకు వెళ్లాడు. సాయంత్రం పశుగ్రాసం తింటున్న సమయంలో పంటచేనులో నిల్వ చేసిన రసాయనాలతో కూడిన నీటిని తాగాయి. దీంతో తీవ్ర అస్వస్థతకు గురై 15 మేకలు అక్కడే మృతిచెందాయి. మరికొన్ని తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. ఘటన స్థలానికి చేరుకున్న మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ సిబ్బందితో కలిసి చికిత్స అందించి మృతిచెందిన మేకలను పరిశీలించారు. రూ.1లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు పెంటన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ దేవుగూడ సమీపంలో మంగళవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొనగా ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... ఉట్నూర్ నుంచి తాడిహత్నూర్ గ్రామంలో బీపీఎంగా పనిచేస్తున్న జాదవ్ గోకుల్ ఉట్నూర్ నుంచి తాడిహత్నూర్‌కు కారులో వెళ్తున్నాడు. హస్నాపూర్ వైపు బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపుతప్పి కారును ఢీకొన్నారు. వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని కారు యజమాని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కోసం 108లో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ప్రమాదానికి గురైన బైక్, కారు

జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు



సేర్ల చిన్నయ్య



నిరూప్ కుమార్

ఆదిలాబాద్: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఆదిలాబాద్ జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. తలమడుగు మండలం కజ్జర్ల ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తున్న సేర్ల చిన్నయ్య, ఉట్నూరు మండలం సాలెవాడ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిరూప్ కుమార్‌లు బ్యాడ్మింటన్ విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలు జనవరి 31వ తేదీ నుంచి ఫిబ్రవరి రెండవ తేదీ వరకు గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో జరగనున్నాయి. క్రీడాకారులను డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో అభినందించారు.

ఒకరికి ఆరు నెలల జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికతో అసభ్యంగా ప్రవర్తించి చంపుతానని బెదిరించిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ జిల్లా మొదటి అదనపు జడ్జి, ఫోక్సో కోర్టు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి పండరి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2020 మార్చి 11న బోథ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జ్వరంతో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తుండగా, మర్లపల్లి గ్రామానికి చెందిన క్యాతం అనిల్ ఇంట్లో చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. బాధితురాలు కుటుంబీకులకు తెలియజేయడంతో వారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేయగా, స్పెషల్ పీపీ రమణారెడ్డి పది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి



తిరుపతి (ఫైల్)

దస్తురాబాద్: రోడ్డు ప్రమాదానికి గురైన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్సై జ్యోతిమణి వివరాల ప్రకారం... మండలంలోని ఆకొండపేట గ్రామానికి చెందిన జాడి తిరుపతి(23) జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 16న పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో మండలంలోని దేవునిగూడెం గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ తీగలు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగలు చోరీకి గురైనట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన శ్రీరామరాజ గోపాల్ విద్యుత్‌శాఖలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. తాంసి మండలంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను బిగించగా మరో ట్రాన్స్‌ఫార్మర్ గిరిగాంలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆరోగ్యం బాగలేక హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈనెల 18న తిరిగి ఇంటికి చేరుకోగా ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌తో పాటు రాగి తీగలు చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వేతనాల పెంపులో ప్రభుత్వాల నిర్లక్ష్యం

ఆదిలాబాద్‌అర్బన్: మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు ఆరోపించారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో కాలం వెలదీస్తున్న కార్మికులకు ఇప్పటికైనా వేతనాలు పెంచి ఆదుకోవాలని పేర్కొన్నారు. పెండింగ్‌లోని బిల్లులను వెంటనే చెల్లించాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికుల వేతనాలు పెంచాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఉన్నారు.



మాట్లాడుతున్న కుంటాల రాములు

వెల్‌నెస్ సెంటర్ నోడల్ అధికారిగా బాబులాల్

ఆదిలాబాద్‌టౌన్: వెల్‌నెస్ సెంటర్ నోడల్ అధికారిగా బాబులాల్‌ను నియమించినట్లు డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ఈయన ప్రస్తుతం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో భవన నిర్మాణ పనులు, తదితర పనులు పరిశీలిస్తారని తెలిపారు. దీంతో పలువురు అభినందనలు తెలియజేశారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి మూడు రోజుల సాధారణజైలు, 48 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరుపరిచారు. దీంతో జిల్లా జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణం కావద్దని ట్రాఫిక్ ఎస్సై తెలిపారు.

లే ఆఫ్ ప్రకటించడం దురదృష్టకరం

నిర్మల్‌ఖైన్‌గేట్: అమెరికాలో టెక్ కంపెనీలు ముందస్తు చర్యలు లేకుండా లే ఆఫ్‌ను ప్రకటించడం దురదృష్టకరమని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ నాయకులు స్వదేశ్ పరికిపండ్ల ఒక ప్రకటనలో తెలిపారు. రూ.లక్షలు చెల్లించి కొన్న హెచ్1బీ వీసాదారులకు 60 రోజుల తర్వాత ఉద్యోగం దొరక్కపోతే దేశం విడిచిపెట్టాలనే ఆ దేశపు నిబంధనను మార్చాలని కోరారు. భారతీయ ఉద్యోగుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని భారత ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంతో మాట్లాడాలని పేర్కొన్నారు.



మామడ మండలం తాంద్ర గ్రామ శివారులోని ఫైరింగ్‌రేంజ్‌లో పోలీసుల ఫైరింగ్ ప్రాక్టీస్‌ను కలెక్టర్ ముషరఫ్ అలీ, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులతో కలిసి ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. అనంతరం శిక్షణలో ప్రతిభ కనబర్చిన పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో వినియోగించే ఆయుధాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆయుధాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ కిరణ్‌ఖారే , అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. - నిర్మల్‌టౌన్